క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో పది కంపెనీలు పాల్గొని 900 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీజీవోవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని చెప్పారు. స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉందని, వివరాలకు 85558 68681 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అలరించిన కథా కచేరీ



కథ లక్షణాలను వివరిస్తున్న రచయిత సత్యనారాయణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన రచయితల స్వీయ కథా పఠనం 'కథా కచేరీ' కార్యక్రమం అలరించింది. రచయిత భాగవతుల సత్యనారాయణమూర్తి సభాధ్యక్షత వహిస్తూ కథను నిర్వచించి, మంచి కథా లక్షణాలను విశదీకరించారు. ఈనాటి కథా కచేరీలో చల్లా రాంబాబు రచించిన పందిరి మంచం, భాగవతుల సత్యనారాయణమూర్తి రచన పరంధామయ్య గారి బస్సు ప్రయాణం, చిన సూర్యనారాయణ రచించిన పోయినోళ్లందరూ మంచోళ్లు, రాంపిళ్ల శివాజీ రచించిన అమ్మ, ఎం.పరమేశ్వరరావు 'నాయనోరు', గుంటూరు సత్యనారాయణమూర్తి 'భార్య', సోమంచి వినయభూషణరావు రచించిన స్వాతంత్ర్యం ఖరీదు, కె.వి.ఎస్ స్వీయకథ చావుతప్పి లొట్ట, డి.ఎస్.కుమార్ రచించిన మానవీయత కథలను చదివి వినిపించారు. చల్లా రాంబాబు, లలితా వాశిష్ట క్షమయా ధరిత్రి కథను విశ్లేషించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆరోగ్య శిబిరంలో పౌష్టికాహారం గురించి వివరిస్తున్న వైద్యాధికారి వెంకటేష్

మద్రిపాలెం: పౌష్టికాహారంతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బీజేపీ నాయకులు శ్యామలదీపిక, సునీల్ అగర్వాల్ అన్నారు. 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో బుధవారం నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆరోగ్య శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె పరిశీలించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌పై బ్యానర్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ పర్యవేక్షించారు. డాక్టర్ జాన్, అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్‌లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బాబోయ్ దుర్వాసన



రామాటాకీస్ రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద నిలిచిన మురుగు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌కు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. క్యాంటీన్ పక్కన ఉన్న డంపర్ బిన్ వద్ద మురుగు నిలిచిపోయి భరించలేని కంపుకొడుతోంది. డంపర్ బిన్‌కు ఇరువైపులా మురుగు నీరు నిలిచిపోవడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. పక్కనే ఉన్న అన్న క్యాంటీన్‌కు, ప్రభుత్వ కంటి ఆస్పత్రికి వెళ్లేవారు దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అన్న క్యాంటీన్‌లో భోజనం తినేసి బయటకు వచ్చాక ఒక్కసారిగా దుర్గాసన భరించలేక వాంతులు అయ్యేలా ఉందని పలువురు చెబుతున్నారు. అన్న క్యాంటీన్ పరిసరాలు అధ్వానంగా ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

విధ్వంస రచన.. తీరని వేదన



శంకరమఠం రోడ్డులో యూకే పార్లర్ ఎదురుగా కూల్చివేసిన బడ్డీలు

- కూటమి ప్రభుత్వంలో ఛిద్రమైన చిరు వ్యాపారుల బతుకులు
- బడ్డీలు, దుకాణాల తొలగింపుతో పెనుభారంగా కుటుంబ పోషణ
- ప్రత్యామ్నాయం చూపకుండా.. ప్రతాపం చూపుతున్న జీవీఎంసీ అధికారులు
- ఉన్నపళంగా రోడ్డున పడేయడంతో ఎలా బతకాలని బాధితుల ఆవేదన

ఫోకస్

కూటమి ప్రభుత్వంలో పేదల బతుకులు ఛిద్రమవుతున్నాయి. ముఖ్యంగా చిరు వ్యాపారులు దిక్కుతోచని స్థితికి చేరారు. చిన్న చిన్న వ్యాపారాలనే నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా రహదారులు, ఫుట్‌పాత్‌ల వెంబండి బడ్డీలు, దుకాణాలు ఏర్పాటు చేసుకుని బతుకుబండిని లాగుతున్న పేదలు.. కూటమి ప్రభుత్వ పుణ్యమాని ఒక్కసారిగా రోడ్డున పడ్డారు. ఆపరేషన్ లంగ్స్ పేరిట వారం రోజులుగా జీవీఎంసీ చేపడుతున్న ఆక్రమణల తొలగింపుల్లో ఎంతో మంది చిరు వ్యాపారులు తమ బడ్డీలు, దుకాణాలను కోల్పోయారు. బడుగుల బతుకు తెరువుపై కనీస ఆలోచన లేకుండా జీవీఎంసీ తీసుకున్న తొలగింపుల నిర్ణయం తమ పొట్టకొట్టిందంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డామని, తమ బతుకులకు భరోసా కరువై.. భారంగా మారాయని చిరు వ్యాపారులు ఆవేదన.. ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సీతంపేట/కంచరపాలెం/తాటిచెట్లపాలెం

ఉత్తర నియోజకవర్గంలో ఎంతో మంది చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు. ఆక్రమణల తొలగింపు పేరుతో జీవీఎంసీ అధికారులు బడ్డీలు, దుకాణాలను ఉన్నపళంగా తొలగించేస్తుండటంతో ఎవరికి చెప్పుకోవాలో.. ఎలా బతకాలో తెలియక కన్నీటి పర్యాంతమవుతున్నారు. జీవీఎంసీ జోన్-5, 3ల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉంది. జోన్-3, 5 పరిధిలో గల 14, 24, 46, 49, 54, 55, 56 వార్డుల్లోని నరసింహనగర్, సీతమ్మధార, అక్కయ్యపాలెం, దొండపర్తి, డైమండ్ పార్క్, శంకరమఠం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, కైలాసపురం, మాధవధార, మురళీనగర్ తదితర ప్రాంతాల రహదారుల్లోని బడ్డీలు, దుకాణాలు, ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. దీంతో వేల సంఖ్యలో చిరు వ్యాపారులు ఒక్కసారిగా రోడ్డున పడ్డారు.



ద్వారకానగర్ జీవీకే కళాశాల ఎదురుగా ధ్వంసం చేసిన బడ్డీలు

బడ్డీలు కూలగొట్టి.. పేదల పొట్ట కొట్టి...

- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు నుంచి దొండపర్తి, డైమండ్ పార్క్ వరకు గల దుకాణాలు, బడ్డీలు, స్టాళ్లను తొలగించడంతో చిరు వ్యాపారులు అంతులేని ఆవేదన వ్యక్తం చేశారు.
- నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతంలో సుమారు 50 మంది చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరందరి బడ్డీలను తొలగించడంతో ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో.. ఎవరైనా సహాయం చేస్తారేమో అని ఆశగా వారంతా ఎదురుచూస్తున్నారు.
- సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ప్రాంతంలోని సుమారు 50 బడ్డీలను నేలమట్టం చేశారు. తమకు కనీస ప్రత్యామ్నాయం చూపకుండా, సమయం ఇవ్వకుండా ఇలా తొలగించడం దారుణమని చిరు వ్యాపారులు వాపోతున్నారు.
- కంచరపాలెం, మురళీనగర్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.



కైలాసపురం శాంతినగర్ రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

రోడ్డున పడిన వేల కుటుంబాలు

దుకాణాలు, బడ్డీల తొలగింపు చర్యలు చేపట్టే ముందుగా జీవీఎంసీ చిరు వ్యాపారులకు పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. కనీసం వారికి నోటీసులు జారీ చేసి, ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంది.



నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతంలో తొలగించిన బడ్డీలు లారీల్లో తరలింపు



సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ప్రాంతంలో తొలగించిన చిరు వ్యాపారుల బడ్డీలు

ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలతో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారాలనే నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న తమపై ప్రతాపం చూపి అన్యాయంగా రోడ్డున పడేశారంటూ చిరు వ్యాపారులు తీవ్ర స్థాయిలో మండిపతున్నారు. కనీస ప్రత్నామాయం చూపకపోవడం దారుణమని కూటమి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఏం కావాలంటూ బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ప్రత్యామ్నాయం ఏది?



32 ఏళ్లుగా శంకరమఠం రోడ్డులో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాను. జీవీఎంసీకి టాక్స్, కరెంట్ బిల్లు కడుతున్నాను. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4 గంటలకు వచ్చి బడ్డీని జేసీబీతో ధ్వంసం చేశారు. రూ.లక్షన్నర నష్టం వచ్చింది. మా లాంటి చిరువ్యాపారుల కడుపు కొట్టారు. జీవనోపాధి లేకుండా రోడ్డున పడేశారు. ఇంటి అద్దె, ఇతర ఖర్చులు ఎలా భరించాలి. ప్రత్యామ్నాయం చూపకుండా, నోటీసులు ఇవ్వకుండా ఏళ్ల తరబడి ఉన్న చిరు వ్యాపారుల బడ్డీలు తొలగించడం అన్యాయం. అధికారులు మాకు నష్టపరిహారం అందించి, ప్రత్యామ్నాయం చూపాలి.

- కె.గౌరీశంకర్, పాన్‌షాప్, అక్కయ్యపాలెం

కుటుంబాన్ని ఎలా పోషించాలి?



19 ఏళ్లుగా సీతంపేట జంక్షన్‌లో రోడ్డు పక్కన పకోడి బండి వేస్తున్నాను. నేను దివ్యాంగుడిని, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పకోడి బండిపై వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ముందస్తు నోటీసు, సమాచార ఇవ్వకుండా ఉన్నపళంగా బండిని లారీలో పట్టుకుపోయారు. నా కుటుంబాన్ని రోడ్డున పడేశారు. ఇప్పుడెలా బతకాలి. వారం రోజులైనా ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు.

- పతివాడ శ్రీరాములు, పకోడి బండి, సీతంపేట



న్యాయం చేయాలంటూ నరసింహనగర్ రోడ్డుపై బైఠాయించిన చిరు వ్యాపారులు (ఫైల్)

పేదల పొట్టకొట్టారు



కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తీరు ఒకే రకంగా ఉంది. పేదల బతుకులపై చిందులు వేస్తున్నారు. 25 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా... ఇప్పటి వరకు మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం సాగేది. నేడు చిరు వ్యాపారులపై ప్రతాపం చూపడం దారుణం.

- ఆడిగర్ల దేవి, శాంతినగర్, కైలాసపురం

రోడ్డున పడ్డాం.. ఆదుకోండి



25 ఏళ్లుగా నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతంలో చిన్న బడ్డీపై పాన్‌షాప్ నడుపుతున్నాను. గతంలో రోడ్డుకు అటువైపున ఉండేవాళ్లం. అక్కడ నుంచి ఇక్కడికి జీవీఎంసీ అధికారులే మార్చారు. ఇప్పుడు ఒక్కసారిగా ఇక్కడ నుంచి మా బడ్డీలను తొలగిస్తే మాకు ఆధారం ఏది? ఇదే వ్యాపారాన్ని నమ్ముకుని ఉన్నాం. మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? ప్రత్యామ్నాయం చూపించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

- నూకరాజు, పాన్‌షాప్, నరసింహనగర్

పేదలు బతికేదెలా..?



20 ఏళ్లుగా సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ పక్కనే చిన్న బడ్డీలో పాన్‌షాప్ నిర్వహించుకుంటున్నాం. ఉన్నపళంగా మా సామన్లు కూడా తీసుకోనివ్వకుండా బడ్డీలపై జీవీఎంసీ అధికారులు ప్రతాపం చూపించారు. ఫ్రిజ్ తీసుకునేవరకు ఆగమన్నా ఆగకుండా క్రేన్‌లతో పగలగొట్టేశారు. ఈ నష్టం ఎలా తీరుతుంది. ఎలా బతకాలి, మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియడం లేదు.

- వెంకటలక్ష్మి, పాన్‌షాప్, సీతమ్మధార

తత్వ పారంగతుడు సచ్చిదానందమూర్తి



ఆచార్య సచ్చిదానందమూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఏయూ ఆచార్యులు

సీతంపేట: ఆధునిక భారతదేశంలోని తత్వశాస్త్ర కోవిదుల్లో ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తిది ఒక ప్రత్యేక స్థానమని ఒడిశా రాష్ట్ర గవర్నర్ ఆచార్య కంభంపాటి హరిబాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఐసీపీఆర్ అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలసాఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి అనే అంశంపై మూడు రోజుల సదస్సులో ప్రసంగించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సచ్చిదానందమూర్తి విగ్రహానికి హరిబాబు నివాళులర్పించారు. ఆచార్య సచ్చిదానందమూర్తి రచనలు, పరిశోధనలు నిరంతరం మనల్ని చైతన్యవంతులను చేస్తూ ఉంటాయన్నారు. ఆయన జీవితాన్ని బోధన, పరిశోధనకు అంకితం చేసిన విధానాన్ని వివరించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య సచ్చిదానందమూర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే అణగారిన వర్గాలకు విముక్తి



మాట్లాడుతున్న ఫ్రంట్ అధ్యక్షుడు వినయ్‌కుమార్

సీతంపేట: దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారం పొందితేనే అణగారిన వర్గాలకు విముక్తి అని అంబేడ్కర్ భావించారని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్ అన్నారు. పూణె ఒడంబడిక దళిత రాజకీయాలపై దాని ప్రభావం అనే అంశంపై బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రత్యేక ఓటింగ్ పద్ధతి ద్వారా తమ అభ్యర్థులను తామే ఎన్నుకునే విధానం అమలు జరిగి ఉంటే నిజమైన దళిత ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయరాజ్, ఏఎంసీ కార్యదర్శి జె.వి.ప్రభాకర్, కోశాధికారి సత్యనారాయణ, డాక్టర్ మాధురి శ్రీనివాస్, డాక్టర్ పల్లవి, ఎస్.సుధాకర్, మహేష్, వేమన తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఆరోగ్య రక్షణలో ఫార్మాకోవిజిలెన్స్ పాత్ర కీలకం

మహారాణిపేట: రోగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మాకోవిజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి అన్నారు. బుధవారం కాలేజీ సమావేశ మందిరంలో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఫార్మకాలజీ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.శ్యామల మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్స్ ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఏఎంసీ ప్రిన్సిపాళ్లు డాక్టర్ వి.మన్మథరావు, డాక్టర్ ఎ.కృష్ణవేణి, ఫార్మకాలజీకి చెందిన డాక్టర్ డి.శ్యామల, ప్రొఫెసర్ డాక్టర్ కె.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

దివ్య స్వరూపిణి దుర్గమ్మ



లలితా పీఠంలో కుంకమ పూజలు చేస్తున్న మహిళలు



సీతంపేటలో అన్నపూర్ణా దేవిగా పార్వతీదేవి



మద్రిపాలెంలో గాయత్రిదేవిగా లలితాదేవి

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో పద్మావతి అమ్మవారిని ధాన్యలక్ష్మిగా అలంకరించారు. ఉదయం చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, అమ్మవారి సన్నిధి, మణిద్వీపంలో శ్రీచక్రనవావరణ, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీ హోమం చేశారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేదమంత్రాల మధ్య శ్రీప్రత్యంగిరా భద్రకాళి సుదర్శన హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. గురువారం ఉదయం 10 గంటలకు దత్తాత్రేయ, దక్షిణామూర్తి హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

- సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు చేశారు.
- పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. లేత పసుపు రంగు చీరలో అమ్మవారు చూడముచ్చటగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించి కుంకుమ పూజలు చేశారు. గురువారం కాత్యాయని దేవి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.



శ్రీలలితా పీఠంలో ధాన్యలక్ష్మిగా పద్మావతి

అన్నపూర్ణదేవిగా లలితాదేవి


మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవి మూడో రోజు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం మురళీనగర్‌లోని చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. వారిని ఆలయ నిర్వాహకులు అభినందించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీవీ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అన్నపూర్ణాదేవిగా కనకమహాలక్ష్మి

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్న గార్డెన్స్‌లో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి, గాయత్రిదేవి, కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు బుధవారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేకువజాము నుంచే వేదమంత్రాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గాయత్రిదేవిగా లలితాదేవి

జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం హైవే పంజాబ్ హోటల్ జంక్షన్ సాయినగర్‌లోని శ్రీ కాశీ విశ్వేశ్వర సమేత శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కొలువైన లలితాదేవి గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



పాత రేసపువానిపాలెంలో అన్నపూర్ణా దేవిగా దుర్గాదేవి



మురళీనగర్‌లో అన్నపూర్ణాదేవి



భరత నాట్యం చేస్తున్న చిన్నారులు



సీతన్న గార్డెన్స్‌లో అన్నపూర్ణ దేవిగా దుర్గమ్మ